క్లుప్తంగా

వచ్చే నెల దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్



పోస్టర్ విడుదల చేస్తున్న అతిథులు

మల్కాపురం: రాష్ట్రంలో తొలిసారి దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్ జరగనుందని స్థానిక నాయకుడు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఆదివారం హిమాచల్‌నగర్‌లో జరిగిన టోర్నమెంట్ పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల జింక్ క్రీడా మైదానంలో ఈ టోర్నమెంట్ జరగనుందని, హ్యూమన్ రైట్స్ జోనల్ ప్రెసిడెంట్ ఉరుకూటి చైతన్య యాదవ్ సారథ్యంలో ఈ పోటీ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

విప్ గణబాబుకు సత్కారం



గణబాబును సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

విశాఖ విద్య: ప్రభుత్వ విప్‌గా నియమితులైన ఎమ్మెల్యే గణబాబును ఆదివారం విశాఖ పశ్చిమ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దాడి పురుషోత్తమ రమేష్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీమోర్చ ఉపాధ్యక్షుడు కోకిలలిగడ్డ విజయ బాబు, నాయకులు చల్ల మంజుల, వలిరెడ్డి శ్రీనివాసరావు, ములకలపల్లి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అపారిశుధ్యం చెంత మంచి నీటి బోరు



తుమ్మడపాలెంలో అధ్వానంగా ఉన్న బోరు పరిసరాలు

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ జంక్షన్ పరిధి తుమ్మడపాలెం రైల్వే ట్రాక్ గెడ్డ రహదారి నుంచి సుభాష్‌నగర్‌కు వెళ్లే రహదారిలో గల 37/57 బోరు పరిసరాలు వ్యర్థాలతో అధ్వానంగా ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండిన భారీ చెట్టు, చెదలు పట్టిన చెక్కలు బోరు సమీపంలో ఉండడంతో మంచినీరు పట్టుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. పారిశుధ్య సిబ్బందికి చెత్త చెదారం, వ్యర్థాలు తొలగించమని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ

పెదగంట్యాడ: మండలంలోని వికాస్‌నగర్‌లో ఓ వృద్ధురాలి మెడలో పుస్తెలతాడును దొంగ తెంచుకుపోయాడు. న్యూపోర్టు క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వికాస్‌నగర్‌లో వుడా ఎంఐజీలోని ఫస్ట్ ఫ్లోర్‌లో శెట్టి రాంబాయి (75) అనే మహిళ ఒంటరిగా నివాసం ఉంటోంది. శనివారం ఆమె మిక్సీ బాగు చేయించుకునేందుకు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చింది. ఇంట్లోని వంట గదిలో ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెల తాడు తెంచుకుపోయాడు. ఆ సమయంలో ఆమె చేతి వేలికి గాయమైంది. వెంటనే ఆమె న్యూపోర్టు క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడి ఫొటోను విడుదల చేశారు. నిందితుని వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

జీవీఎంసీ జాగా.. వేసేయ్ పాగా..!

- దర్జాగా ఆక్రమణల పర్వం
- చోద్యం చూస్తున్న అధికార గణం



జీవీఎంసీ 90వ వార్డు నారాయణ స్కూల్ దారిలో ఆక్రమణలు



రాత్రికి రాత్రే వెలసిన బడ్డీ

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గంలో జీవీఎంసీ స్థలాలు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. రహదారులను సైతం ఆక్రమించేసి దర్జాగా పక్కా దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో ఆక్రమణల పర్వం జోరుగా కొనసాగుతోంది. ఇలాంటి వాటిపై నగర పాలక సంస్థ అధికారులు చూసీచూడనట్టుగా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 90వవార్డు బాజీ జంక్షన్ సమీపంలో నారాయణ స్కూల్ దగ్గరలో రహదారిపై దుకాణాలు వెలిశాయి. రోడ్డుమీదే పక్కాగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు.ఇదే దారిలో పాఠశాలలు, కాలేజీలు, బ్యాంకులు, ఇతర వాణిజ్య దుకాణాలు ఉన్నాయి. నారాయణ స్కూల్‌కు ఎదురుగా రహదారిపై ఏర్పాటు చేసిన దుకాణం వద్ద స్కూల్ పిల్లలు గంటల తరబడి వేచి ఉంటున్నారు. దుకాణంలో సిగిరెట్లు, పాన్‌పరాగ్ వంటి నిషేధిత వస్తువులు కూడా విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. ఇదొక్కటే కాదు పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి.

బాగోతం బట్టబయలయ్యేనా!

జీవీఎంసీ 52వ వార్డు కరాసలో ప్రభుత్వ స్థలంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణం వెలిసినా సంబంధిత అధికారులు నిద్రనటించారని ప్రజానీకం ఆరోపిస్తున్నారు. జోన్–5 టౌన్ ప్లానింగ్ అధికారుల మామ్ముళ్ల మత్తుతో ప్రభుత్వ స్థలంలోనే ఏకంగా బహుళ అంతస్తుల భవనం లేచిందని... ఆ స్థలంపై వివాదం రేగడంతో చివరకు నాలుక కరుచుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు ఇచ్చిన ఇంటి నిర్మాణ ప్లాన్ రద్దు చేశారు. అయితే, ఈ భవన నిర్మాణంపై క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే జీవీఎంసీ అధికారులు ఎలా అనుమతి ఇచ్చారనేది ప్రశ్నార్థకం. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయనే ప్రచారం ఉంది. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపిస్తే టౌన్ ప్లానింగ్ విభాగం బాగోతం బట్టబయలు అయ్యే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

అటెన్షన్ ప్లీజ్



జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని అన్నా క్యాంటీన్‌కు వెళ్లే దారిలో విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన ఫ్యూజ్‌బాక్స్ ప్రమాదకరంగా ఉంది. అన్నా క్యాంటీన్‌కు రోజూ ఉదయం, రాత్రి వేళల్లో భోజనం కోసం ఇదే దారిలో వెళ్తుంటారు. క్యాంటీన్‌కు 50 అడుగుల సమీపానే ఇది రహదారిపై ఉంది. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. -విశాఖ విద్య

బాక్సింగ్‌లో ఏంజెలినాకు బంగారు పతకం



పతకం సొంతం చేసుకున్న ఏంజెలినా

మల్కాపురం: స్థానిక సెయింట్ జోసెఫ్ సెకండరీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఏంజెలినా బాక్సింగ్‌లో బంగారు పతకం సొంతం చేసుకుంది. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన అంతర్ జిల్లా, రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో ఏంజెలినా బాలికల విభాగంలో 40–50 కేజీల విభాగంలో విజేతగా నిలిచి బంగారు పతకం దక్కించుకుంది. దీంతో వచ్చే నెల 8 నుండి 15వ తేదీ మధ్యలో న్యూఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి బాలికల బాక్సింగ్ పోటీకి అర్హత సాధించింది. ఈ ఘనత సాధించిన ఏంజెలినాను పాఠశాల ప్రిన్సిపాల్ దీప్తి థామస్, వైస్ ప్రిన్సిపాల్ ఎనిట్, పి.టి. ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, క్లాస్ టీచర్ స్వర్ణరాజు తదితరులు ఆదివారం ఆమె ఇంటికెళ్లి ఆమెకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

పారిశ్రామిక కాలుష్యంతోనే విశాఖకు ముప్పు



పుస్తకం ఆవిష్కరిస్తున్న పర్యావరణ ప్రచారకర్త సోహన్ హటంగడి తదితరులు

సీతంపేట : పారిశ్రామిక కాలుష్యం విశాఖ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని పర్యావరణ ప్రచారకర్త సోహన్ హటంగడి అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన మానవ హక్కుల వేదిక 9వ మహాసభల్లో ఆయన విశాఖలో పర్యావరణ విధ్వంసంపై ప్రసంగించారు. పరిశ్రమల కాలుష్యం, సీవేజ్ వ్యర్థాలు, పోర్టు కాలుష్యం, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వ్యర్థాలు విశాఖలో కాలుష్యానికి ప్రధాన కారణాలని పేర్కొన్నారు. విశాఖ పోర్టు, గంగవరం పోర్టు నుంచి వస్తున్న బొగ్గు, ధూళి చాలా ప్రాంతాలకు విస్తరించి కాలుష్యం బారిన పడేస్తున్నాయన్నారు. పోర్టులో కోల్ డంపింగ్ వద్ద కాలుష్య నివారణ చర్యలు సక్రమంగా తీసుకోకపోవడంతో దుమ్ము, ధూళి వ్యాపిస్తున్నాయన్నారు. కోల్ డంపింగ్స్‌ను కవర్స్‌తో పూర్తిగా కప్పాలని, వాటరింగ్ చేయాలని నేషనల్ ట్రిబ్యునల్ చెప్పినా అమలు చేయడం లేదన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రమాదకరమైన, అత్యంత ప్రమాదకరమైన జాబితాలో 386 పరిశ్రమలు ఉన్నాయని కాగ్ నివేదికలో పేర్కొన్నట్టు చెప్పారు. గత ఐదేళ్లలో ప్రమాదకర పరిశ్రమలకు పీసీబీ 110 నోటీసులు జారీ చేసిందన్నారు. కాలుష్యాన్ని గరిష్ఠంగా వెదజల్లే ప్రభుత్వ రంగంలోని ఎన్‌టీపీసీ, హెచ్‌పీసీఎల్, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఒక్క నోటీసు కూడా జారీ చేయలేదన్నారు. చిన్న పరిశ్రమలపైనే పీసీబీ ప్రతాపం చూపిస్తోందన్నారు. కాలుష్యం కారణంగా అనేక్ర మంది ఆస్పత్రుల పాలవుతున్నా కాలుష్య నియంత్రణాధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శరత్ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేసేందుకు అన్ని విధాలా నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1380 రోజులుగా కార్మికులు, ప్రజా సంఘాలు ఉద్యమిస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షురాలు కె.అనురాధ పారిశ్రామిక కాలుష్యంపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్ పాల్గొన్నారు.

ఉక్కు టౌన్‌షిప్‌లో పిక్నిక్ సందడి



అన్నసమారాధనలో పాల్గొన్న ఉక్కు నగరవాసులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం కార్తీక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సెక్టార్–6లోని ఉమామహేశ్వర దేవాలయంలో ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కూర్మన్నపాలెం నృత్యనికేతన్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు జి.వి.ఎన్. ప్రసాద్, గణేష్‌లు సతీసమేతంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనలో వందలాది మంది పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్ సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమలో ఉక్కునగరం దేవాలయాల అసోసియేషన్ కార్యదర్శి ఆచార్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్ల పైనే వ్యాపారాలు



కంచరపాలెం నేతాజీ కూడలిలో రోడ్లపై వ్యాపారాలు

ప్రజల ఇబ్బందులు

కంచరపాలెం: స్థానిక నేతాజీ కూడలి బీఆర్‌టీఎస్ రహదారి నుంచి ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్‌కు వెళ్లే సబ్‌వేలో ఇష్టారాజ్యంగా చిరు వ్యాపారాలు చేస్తున్నారు. వినియోగదారులు తమ అవసరాలకు దుకాణాలకు చేరుకునే క్రమంలో తమ వాహనాలను రోడ్లపై అడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ సెల్లార్లలో వ్యాపారాలు చేస్తుండడంతో వినియోగదారుల ద్విచక్ర వాహనాలు సబ్‌వే మార్గాల్లో పార్కింగ్ చేయడంతో వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. అటుగా వెళ్లే పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత ట్రాఫిక్ పోలీసులు సమస్యపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

యారాడ చూసొద్దాం.. రారండోయ్..

చుట్టూ కొండలు.. పచ్చని చెట్లు.. ఆహ్లాదం పంచే రోడ్డు.. విశాలమైన తీరం యారాడ సొంతం. ప్రకృతి అందాలు.. **ఇసుక తిన్నెలు** చూసి తరించడానికి యారాడ **తీరం** ఆహ్వానం పలుకుతోంది. గంగ**వరం ఘాట్** రోడ్డు ఒంపులు పర్యాటకుల**ను మరింత** ఆకర్షిస్తున్నాయి. దీంతో యారాడ **తీరం** ప్రతిరోజూ పర్యాటకులతో క**ళకళలాడుతూ** ఉంటోంది. కార్తీక మాసం కా**వడంతో ఈ** తీరానికి పర్యాటకుల తాకిడి **మరింత** పెరిగింది. –పెదగంట్యాడ



కొండలపై కనువిందు చేస్తున్న కొబ్బరి చెట్లు





యారాడ బీచ్‌లో పర్యాటకుల సందడి

- పరవశించేలా ప్రకృతి అందాలు
- ఘాట్‌రోడ్ ప్రయాణం.. ప్రత్యేక అనుభూతి
- పర్యాటకులను ఆకర్షిస్తున్న సాగర తీరం

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

గాజువాక, మల్కాపురం, సింధియా ప్రాంతానికి చెందిన వారే కాకుండా అనకాపల్లితో పాటు వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు యారాడ తీరానికి వస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ అక్కడే ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడుపుతారు. కార్తీక మాసంలో రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. వీరంతా ప్రకృతి అందాలను తిలకిస్తూ.. ఇసుక తిన్నెల్లో ఆటలాడుతూ.. సముద్ర అలలతో సయ్యాటలాడుతూ పరవశించిపోతారు. ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా నుంచి కూడా పర్యాటకులు యారాడకు క్యూ కడుతున్నారు.



యారాడ తీరానికి వెళ్లే ఘాట్‌రోడ్డు

ఫొటో షూట్‌లకు అనుకూలం



ఫొటో షూట్‌లకు యారాడ తీరం చాలా అనువైన ప్రదేశం. పిక్నిక్ ఏర్పాటు చేసుకునేవారికి ఇక్కడ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. ఆటలు ఆడుకునేందుకు, సంతోషంగా తిరిగేందుకు చుట్టూ కొండలు, కొబ్బరి చెట్లు ఉన్నాయి.తీరం వంపు, పచ్చదనం ఆనందంతో పాటు ఆహ్లాదం పంచుతాయి. పిల్లలు, పెద్దలు ఎంజాయ్ చేస్తారు.

– కులుకూరి వాసు, నడుపూరు

ఆహ్లాదకర ప్రదేశం



యారాడ తీరం పిక్నిక్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుంది. సెలవుల సమయంలో కుటుంబంతో వచ్చి ఆహ్లాదకరంగా గడిపేందుకు చాలా అనువైన ప్రదేశం. చుట్టూ కొండలు, పచ్చని వాతావరణంతో పాటు తీరానికి వెళ్లే వంపులు తిరిగిన ఘాట్‌రోడ్డు మయమరిపిస్తాయి. ఈ వాతావరణం సందర్శకుల మనసును దోచుకుంటుంది.ఎన్ని సార్లు వెళ్లినా మళ్లీ మళ్లీ వెళ్లాలనిపించే ప్రదేశం యారాడ తీరం.

– జి బాలాజీ, పెదగంట్యాడ

రాజ్యాంగ పరిరక్షణతోనే ప్రజలకు రక్షణ

ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

సీతంపేట : రాజ్యాంగాన్ని రక్షించుకున్నప్పుడే ప్రజలను రక్షించుకున్నట్టని పలువురు మేధావులు స్పష్టం చేశారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భీమ్‌సేన వార్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్‌లో 'భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఎన్నికలు, ప్రజా సంక్షేమం'పై ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జి.హరగోపాల్, దుప్పలపూడి రవికుమార్, డాక్టర్ సుదర్శన్, గూడూరు సీతామహాలక్ష్మి, రత్నకుమారి, వి.వి. రమణమూర్తి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల హక్కుల కోసం, సమాన అవకాశాల కోసం భారత రాజ్యాంగాన్ని అంబేడ్కర్ రూపొందించారని తెలిపారు. అగ్ర కులాల చేతుల్లో అధికారం ఉండటం వల్ల రాజ్యాంగంలోని అన్ని అంశాలు అమలు కావడం లేదన్నారు. మతోన్మాదం తీవ్రతరం అవుతోందని, మరోవైపు పరిశ్రమలు ప్రైవేటీకరిస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని మార్చివేసే కుట్ర జరుగుతోందని, కాపాడుకోవడానికి బహుజనులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. భీమ్‌సేన వార్ ప్రధాన కార్యదర్శి వసంత రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో కేబీఆర్ అంబేడ్కర్, బూసి వెంకటరావు, బర్రె అప్పారావు, చింతాడ సూర్యం, బొడ్డు కల్యాణ రావు, కొత్తపల్లి వెంకటరమణ, పతివాడ రాంబాబు, ఏఎస్సార్ వేమన పాల్గొన్నారు.

అధ్వానంగా సీసీ రోడ్లు

- మట్టి రోడ్లను తలపిస్తున్న వైనం
- రాకపోకలకు అవస్థలు పడుతున్న ప్రజలు



సెబాస్టియన్ కాలనీ రహదారి దుస్థితి

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలోని పలు కాలనీల్లోని సీసీ రోడ్లు అధ్వానంగా మారాయి. మట్టిరోడ్లను తలపిస్తున్నట్లు సిమెంటు, కాంక్రీట్ రోడ్లు ఉండటంతో పాదచారులు, వాహన చోదకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అటుగా రాకపోకలు సాగించాలంటేనే ఆందోళన చెందుతున్నారు. గతంలో యూజీడీ, 24/7 పైపులైన్ల కోసం తీసిన గోతుల్లో పైపులు వేసి గోతులు పూడ్చి వదిలేశారు. ఎన్నికల కోడ్ రావడంతో అంతంతమాత్రంగా పనులు చేసిన జీవీఎంసీ అధికారులు అలాగే వాటిని ముగించేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఐదు మాసాలు అయినా సీసీ రోడ్లు వేయకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు గోతులమయంగా మారాయి. జ్ఞానాపురం పరిధిలో ఎర్రిగెడ్డ వీధి, బాబూకాలనీ, సెబాస్టియన్‌కాలనీ, జేఎస్ఎన్ యూఆర్ఎం కాలనీ, పోస్టాఫీస్ వీధి, సాలివీధి, స్లీప్‌సర్టు వీధి తదితర ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి మరీ దారుణంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. జోన్–5 ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఎన్నికల కోడ్ అంటూ నాడు కాలయాపన చేశారని, నేడు సీసీ రోడ్ల పట్ల అధికారులు కన్నెత్తి చూసే పరిస్థితి కనిపించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గెడ్డ వీధి, సెబాస్టియన్ కాలనీ బాబూకాలనీలకు వెళ్లే ప్రధాన రహదారిలో పైపులైన్ కోసం తీసిన మట్టి ఇప్పటికీ రోడ్లలో సగం మేర ఉండడంతో అటుగా వెళ్లే ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆపై విద్యుత్ లైట్లు సక్రమంగా పని చేయకపోవడంతో పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఆయా కాలనీల్లో జరిగిన పనులపై జోనల్ అధికారులకే సరైన స్పష్టత లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇంజినీరింగ్ అధికారులతో సీసీ రోడ్ల నిర్మాణంపై మాట్లాడితే యూజీడీ, 24/7 డిపార్ట్‌మెంటు అధికారుల పర్యవేక్షణలో కాంట్రాక్టర్లు తవ్విన గోతులను వారే పూడ్చాలని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.